ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 17 ఫిబ్రవరి 2025

● బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్







● వెలవెలబోయిన షాపులు ● మటన్, చేపల మార్కెట్ల వద్ద రద్దీ

చికెన్.. తగ్గెన్!

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఆదివారం.. చికెన్ షాపుల్లో అమ్మకాలు పెరిగేవి. చాలాచోట్ల గుంపులుగా నిలబడాల్సిన పరిస్థితి. అలాంటిది ఈ ఆదివారం చికెన్‌షాపులన్నీ ఖాళీగా కనిపించాయి. అక్కడక్కడా ఒకరిద్దరు ఉన్నారంతే. కొనుగోలుదారులే లేకుండా పోయారు. బర్డ్ ఫ్లూ ఆందోళనతో జనం చికెన్ కొనుగోలుకు ఆసక్తి చూపలేదు. ధరలు తగ్గినా.. కొనుగోళ్లపై ప్రభావం చూపలేదు. తిరుపతి నగరంలోని లీలామహల్ సర్కిల్, తిలక్ రోడ్డు, మంగళం రోడ్డు, కొర్లగుంట రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం పూట సందడిగా కనిపించే చికెన్ దుకాణాలన్నీ వెలవెలపోయాయి. అదే సమయంలో చేపల దుకాణాల వద్ద జనం కిక్కిరిశారు. లీలామహల్ నుంచి దేవేంద్ర థియేటర్‌కు వెళ్లే దారిలో చేపల మార్కెట్ వద్ద ప్రతి ఆదివారం జనం రద్దీ ఉంటుంది. ఈ ఆదివారం మరింతగా కొనుగోలుదారులు పెరిగారు. చికెన్ వద్దనుకున్న వారిలో అత్యధికులు చేపల వైపు మొగ్గు చూపారు. ఉదయం 5 గంటల నుంచే వందలాది మంది దుకాణాల వద్దకు చేరుకున్నారు. కొన్ని రకాల చేపల ధరలు అమాంతంగా పెంచినా.. కొనుగోళ్లు తగ్గలేదు. చేపల మార్కెట్ వద్ద ఒకదశలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా, నగరంలోని పలుచోట్ల మధ్యాహ్నం 12 గంటలకే చేపలు అయిపోయాయి. ఇక, గతంకన్నా ఈ ఆదివారం మటన్ కొనుగోళ్లూ పెరిగాయి. బర్డ్ ఫ్లూ ప్రభావాన్ని పసిగట్టిన కొందరు చికెన్ దుకాణదారులు.. ఈ ఆదివారం మటన్ విక్రయాలు ప్రారంభించడం గమనార్హం. మటన్ ధరలూ పెరిగాయి. మధ్యాహ్నానికి చాలా మాంసం దుకాణాలు కూడా ఖాళీ అయ్యాయి.

● 10 రోజుల కిందటి వరకు కిలో చికెన్ బ్రాయిలర్ రూ.280 వరకు ధర పలికింది. ఇప్పుడు చాలాచోట్ల స్కిన్ రూ.90, స్కిన్‌లెస్ రూ.110 వరకు.. ఇంకొందరు రూ.160 వరకూ ధరలు పెట్టారు. ఇలా ఒక్కో ధరలున్నాయి. తిరుపతిలో దాదాపు 230 చికెన్ షాపులున్నాయి. ఆదివారం గరిష్ఠంగా రూ.28 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వ్యాపారం జరిగేది. ప్రస్తుతం రూ.లక్ష జరగడం కష్టంగా ఉందని చికెన్ దుకాణాల సంఘం నేతలు అంటున్నారు.

● సాధారణ రోజుల్లో కిలో చేపలను రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.560 వరకు విక్రయించేవారు. ఈ ఆదివారం డిమాండు పెరగడంతో సగటున కిలోపై రూ.వంద పెరిగింది.

● కిలో మాంసంపై రూ.50 నుంచి రూ.80 వరకు ధర పెంచారు. కిలో రూ.930 నుంచి రూ.వెయ్యి వంతున అమ్మారు.



సినీనటుడు మంచు మనోజ్ - పశువులను నిలువరిస్తున్న యువకులు - గాయపడిన వారికి చికిత్స

పట్టుకో.. పట్టుకో

ఉత్సాహం ఉరకలేసిన జల్లికట్టు

పశువుల నిలువరింతలో పలువురికి గాయాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు మొదలై.. సాయంత్రం వరకు సాగింది.ఈ జల్లికట్టులో పాల్గొనేందుకు పరిసర ప్రాంతాల రైతులు తమ ఎద్దులను తీసుకొచ్చారు. వాటికి ఫొటోలు, టీడీపీ, వైసీపీ, జనసేన జెండాలను కట్టి వదిలారు. వేలాదిగా తరలి వచ్చిన యువకులు అల్లె అవతల నిలబడి కోడెగిత్తలను నిలువరించి.. వాటి కొమ్ములకున్న చెక్క పలకలను సొంతం చేసుకొనేందుకు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొందరు యువకుల మధ్య కొన్నిసార్లు ఘర్షణ జరిగింది.పశువుల నిలువరింతలో కిందపడటంతో 40 మందికి పైగా గాయపడ్డారు. చెక్క పలకలను చేజిక్కించుకున్న యువకులు ఉత్సహంగా కేరింతలు కొట్టారు. క్షతగాత్రులకు అక్కడే ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్స కేంద్రంలో వైద్యసేవలందించారు. తీవ్ర గాయాలైన వారిని తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. కాగా, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు డీజే మ్యూజిక్‌తో ర్యాలీగా తమ ఎద్దులను జల్లికట్టు ప్రదేశానికి తీసుకొచ్చారు. జల్లికట్టు వీక్షణకు వచ్చిన సినీనటుడు మంచు మనోజ్‌కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వచ్చిన జనానికి గ్రామస్తులు భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

● శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలపై హోం మంత్రి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పించాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసినట్టు హోంమంత్రి అనిత తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనంలో ఆదివారం ఆమె ఉత్సవాల ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికారులు పనిచేయాలన్నారు. స్వామి, అమ్మవార్లకు ఈనెల 25న సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం ఉందన్నారు. వీఐపీలకు ప్రత్యేక టైంస్లాట్ కేటాయించడంతో పాటు భక్తుల కోసం వైద్యబృందాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా పెడతామన్నారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఈ ఏడాది భక్తులందరికీ లడ్డూ ప్రసాదంతో పాటు నీళ్ల బాటిళ్లను ఉచితంగా సరఫరా చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. స్థానికులకు ప్రత్యేక ఉచిత దర్శనం కల్పిస్తున్నామన్నారు. ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. అంతకుముందు స్వామి అమ్మవార్లను హోంమంత్రి అనిత దర్శించుకున్నారు. మృత్యుంజయ స్వామి సన్నిధిలో మంత్రిని శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారమూ జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొన్ని అనివార్య కారణాలతో ఈ వారం రద్దు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఫిర్యాదులు, వినతులు ఇవ్వదలచిన వారు నేరుగా సమీప పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని కోరారు.



ఐటీసీఎక్స్‌కు సిద్ధమైన వేదిక

అంతర్జాతీయ ఆలయాల సదస్సుకు
తిరుపతి వేదిక

నేటినుంచి మూడు రోజుల పాటు ఐటీసీఎక్స్

శ్రీవారి ఆలయంపైనా చర్చాగోష్ఠి

సీఎం చంద్రబాబు సహా గోవా, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల రాక

తిరుపతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దేవాలయాల సదస్సుకు తిరుపతి వేదిక కానుంది. ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-2025 (ఐటీసీఎక్స్) పేరిట టెంపుల్ కనెక్ట్ సంస్థ మంగళం రోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్లో మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించనుంది. సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభ సభ జరగనుంది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి సీఆర్ ముకుంద్‌లతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. మంగళ, బుధవారాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు సమావేశాలు జరుగుతాయి. తిరుమల శ్రీవారి ఆలయ పాలనపరమైన అంశాలపైనా సదస్సులో చర్చించనున్నారు. దేవాలయ పరిపాలన, నిర్వహణపై జరిగే ఐటీసీఎక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆలయాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి ఆదివారం మీడియాకు చెప్పారు. ఎక్స్‌పో చైర్మన్, మహారాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ ప్రసాద్ లాడ్ మాట్లాడుతూ.. దేవాలయ ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేయడం, భక్తులకు సౌలభ్యాన్ని పెంచడం తదితరాలపై ప్రధానంగా చర్చ ఉంటుందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, తొక్కిసలాట జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసాదాల నాణ్యతకు అధునాత ల్యాబ్‌లు, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ పద్ధతులపై మాస్టర్ క్లాసులు ఉంటాయన్నారు. ఆలయ ట్రస్టుల ద్వారా విద్య, వైద్యం, ధార్మిక సేవాకార్యక్రమాల నిర్వహణపైనా చర్చ జరుగుతుందన్నారు. 2023లో వారణాసిలో ఐటీసీఎక్స్ నిర్వహించామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో అంత్యోదయ ప్రతిష్ఠాన్ చైర్‌పర్సన్ సీతాలాడ్ పాల్గొన్నారు.

ప్రధాన చర్చలివే

ప్రధానంగా రోజుకో అంశంపై చర్చించనున్నారు. ఆలయ విద్యపై జరగనున్న ప్యానెల్ చర్చలో షిర్డీ మాజీ చైర్మన్ డాక్టర్ సురేష్ హవారే, వెలింగ్కర్ ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ సలుంఖే ప్రధానవక్తలుగా పాల్గొంటారు. 'దేవాలయాలకు నెట్‌వర్కింగ్ శక్తి' అంశంపై గోవా ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే, మహారాష్ట్ర అష్ట వినాయ దేవాలయాల ట్రస్టీలు ప్యానెల్ చర్చలో ఉంటారు. దేవాలయాల చుట్టూ ఉన్న చట్టపరమైన సమస్యలపై న్యాయవాది విష్ణుజైన్ మాట్లాడతారు.

ముగ్గురు సీఎంల రాకతో
పటిష్ఠ బందోబస్తు



కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాట్లు, బందోబస్తుపై చర్చిస్తున్న ఎస్పీ, జేసీ, కమిషనర్

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: తిరుపతికి సోమవారం ఏపీ, గోవా, మహారాష్ట్ర సీఎంలు చంద్రబాబు, ప్రమోద్ సావంత్, దేవేంద్ర ఫడ్నవీస్, పలువురు వీవీఐపీలు రానున్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరిలో గోవా, మహారాష్ట్ర సీఎంలు తిరుమలకూ వెళ్లనున్నారు. దీంతో తిరుమలలోనూ భద్రతపై దృష్టి పెట్టారు. ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నుంచి అడ్వాన్స్‌డ్ లైజన్ సెక్యూరిటీ నిర్వహించారు. సదస్సు జరిగే ఆశ కన్వెన్షన్ సెంటరు వద్ద డీఐజీ షిమోషీ, ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు, 70 మంది ఎస్‌ఐలు, మరో 800 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే బాంబు, డాగ్ స్క్వాడ్లు ఆశ కన్వెన్షన్ సెంటరులో తనిఖీలు చేశారు. ఎస్పీ, జేసీ శుభం బన్సల్, కమిషనరు మౌర్య తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. తిరుపతిలోని వివిధ విద్యాసంస్థలు, హోటళ్లకు ఇటీవల బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

సీఎంల పర్యటన ఇలా..

● ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.45 గంటలకు ఆశ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని సాయంత్రం 6.15 గంటల వరకు ఉంటారు.

● మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సోమవారం ఉదయం 8.45 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ్నుంచి తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. 3.10 గంటలకు బయలుదేరి తిరుపతిలో సదస్సుకు వస్తారు. ఈ కార్యక్రమం చూసుకుని రాత్రి ఏడు గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

● గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మధ్యాహ్నం 12.05 గంటలకు విమానాశ్రయానికి.. 1.30 గంటలకు తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. సాయంత్రం 4 గంటలకు తిరుపతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొని.. 7.50 గంటలకు విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు వెళతారు.

జిల్లాలో కార్డన్ సెర్చ్



పాకాలలో కార్డన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

● 10 పోలీసు స్టేషన్ల పరిధిలో 636 వాహనాల తనిఖీ.. 95 సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పది పోలీసు స్టేషన్ల పరిధిలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాకాల, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, కోట, సూళ్లూరుపేట, నాగలాపురం, పుత్తూరు, అలిపిరి స్టేషన్ల పరిధిలో తెల్లవారు జామున 5 గంటల నుంచి ఆయా డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది కలసి శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీలు, విల్లాల్లో తనిఖీలు చేపట్టారు. అన్ని స్టేషన్ల పరిధిలో 636 వాహనాలు తనిఖీ చేశారు. ఎలాంటి రికార్డులు, లైసెన్సులు, వివిధ ధృవీకరణ పత్రాలు లేని 86 ద్విచక్ర వాహనాలు, ఏడు ఆటోలు, రెండు కార్లు సీజ్ చేశారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట కార్డన్ సెర్చ్ చేస్తుంటామని ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు చెప్పారు. అనుమానితులు ఎవరైనా సంచరిస్తుంటే సమీప స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

9 నుంచి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

తిరుమల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 9 నుంచి 13వ తేది వరకు జరుగనున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజున సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి, రెండవరోజు రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి తెప్పపై మూడుసార్లు విహరిస్తారు. మూడవ రోజు మలయప్పస్వామి మూడుసార్లు, నాలుగో రోజు ఐదుసార్లు, చివరిరోజు ఏడు సార్లు తెప్పపై పుష్కరిణిలో విహరించి భక్తులను కటాక్షిస్తారు. ఈ సందర్భంగా మార్చి 9, 10 తేదీల్లో సహస్ర దీపాలంకార సేవ, 11, 12, 13 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనార్దన్‌రెడ్డి

తిరుచానూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమర శిల్పారామాన్ని సందర్శించారు. ఒక వివాహానికి హాజరైన అనంతరం పర్యాటక శాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక అభివృద్ధికిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. శిల్పారామంలో చేపట్టిన రెండు భారీ ప్రాజెక్టులను త్వరిత గతిన పూర్తి చేసేందుకు పర్యాటకశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శిల్పారామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టూరిజం జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి శిల్పారామంలోని పలుప్రాంతాల గురించి వివరించారు.

నయనమనోహరంగా భరతనాట్యం



తిరుచానూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా తమిళనాడు తిరుకలుకుండ్రంకు చెందిన నటేశా నృత్యాలయం కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యం నయన మనోహరంగా సాగింది. కళాకారులు మాదంగి గణేష్, సాధన, శుభవర్షిణి, సబిత, శుభశ్రీ, శ్రీగా, హరిణి, నందికా, నివేతా, మోహన్ ప్రియ తదితరులు పుష్పాంజలి, శ్రీమన్నారాయణ, విషమ కారకర్ణ, సూర్యకౌత్వం, బ్రహ్మమొక్కటే పరబ్రహ్మ, విష్ణు కౌత్వం, గురుడ గమన వంటి కీర్తనలకు భరత నాట్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

పోలీసుల జోక్యంతో సమసిన అంత్యక్రియల వివాదం



సరోజమ్మ మృతదేహంతో బంధువుల ధర్నా

తిరుచానూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వేమూరు అరుంధతివాడలో ఓ వృద్ధురాలి అంత్యక్రియల సందర్భంలో శనివారం రాత్రి వివాదం తలెత్తింది. వివరాలిలా.. గ్రామంలో అనారోగ్యంతో చనిపోయిన సరోజమ్మ అంత్యక్రియలకు గ్రామ శివారు స్మశాన స్థలంలో సాయంత్రం కొందరు గుంత తవ్వారు. గ్రామానికి చెందిన నాగార్జునరెడ్డి అలియాస్ బుల్‌రెడ్డితో మరో వ్యక్తి ఈ స్థలం తనదంటూ గుంతను పూడ్చివేశారు. దీనిపై ఆగ్రహించిన దళితులు సరోజమ్మ మృతదేహంతో అక్కడే బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని తిరిగి అదే గుంతలో అంత్యక్రియలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. నాగార్జునరెడ్డి మరికొందరిపై వెంకటేశ్వరు, మునిరామాయ్య, రాజా, నాగరాజు, సుబ్రహ్మణ్యం ఫిర్యాదుచేశారు.

ఎట్టకేలకు గుండోడు కనుమ రోడ్డు పనులు



రామచంద్రాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గుండోడుకనుమ రోడ్డు పనులుజోరుగా జరుగుతున్నాయి. చాన్నాళ్లుగా తాటిమాకుల కండ్రిగ నుంచి కొత్త నెన్నూరు వరకు గుండోడు కనుమ మీదుగా ప్రజలు నడిచి వెళ్లేవారు. ఈ దారి అందుబాటులోకి తేవాలని 50 ఏళ్లుగా 20 గ్రామాల ప్రజలు కోరుతున్నా ఎవరూ స్పందించలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని హామీ ఇచ్చారు. ఈక్రమంలో చొరవ తీసుకుని సీఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడి కొత్త నెన్నూరు నుంచి తాటిమాకులకండ్రిగ వరకు 3 కిలోమీటర్ల తారు రోడ్డు వేసేందుకు రూ.3కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. ఈ దారి పూర్తయితే కట్టపై ప్రాంతంలోని 20 గ్రామాల ప్రజలకు తిరుపతి వెళ్లేందుకు సుమారు 15కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

మూతపడ్డ రైస్ మిల్లులతో రైతుల ఇబ్బందులు



రామచంద్రాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లులు లేక రైతులు దూరాభారంతో ఇబ్బంది పడుతున్నారు. 20 ఏళ్ల క్రితం వరకు రావిళ్లవారిపల్లె నుంచి మిట్టకండ్రిగ, అనుపల్లె వరకు 29 మిల్లులుండేవి. వ్యాపారస్థులు, కూలీలు ఉపాధి పొందేవారు. కాలక్రమంలో రైతులు సాగుపై ఆసక్తి చూపకపోవడంతో ౨ రైస్‌మిల్లులు మూతపడ్డాయి. రైతులు ఉన్న ధాన్యాన్ని కూడా పొలాల్లో విక్రయించేవారు. రెండేళ్లుగా బియ్యం ధర పెరగడంతో రైతులు వరి, వేరుశనగ సాగుపై మళ్లీ ఆసక్తి చూపిస్తున్నారు. ఐదేళ్ల క్రితం వెయ్యి హెక్టార్లలో సాగిన సాగు విస్తీర్ణం ప్రస్తుతం రెండింతలయ్యింది. రైతులు ధాన్యాన్ని చంద్రగిరి, పెనమూరు, తిరుపతి రూరల్ ప్రాంతాల్లోని మిల్లులకు తరలించాల్సి ఉంది. అదనపు భారం పడుతున్నా తప్పడంలేదు.

ఇంటీరియం రిలీఫ్ ప్రకటించాలి: ఆర్టీసీ ఈయూ



ఆర్టీసీ యూనియన్ నాయకుల సమావేశం

తిరుమల, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): మెరుగైన పీఆర్సీ ఇవ్వాలని, ఇంటీరియమ్ రిలీఫ్(ఐఆర్) ప్రకటించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి నరసయ్య కోరారు. తిరుమలలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం ఎన్ఎంయూఏ, వైఎస్ఆర్ఏ సంఘాల నుంచి ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరిన 90 మందిని సత్కరించి ఆహ్వానించారు. అనంతరం దామోదరం మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పదోన్నతులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగ వర్గాలకు జరిగిన అన్యాయాలను సరిచేస్తారనే కూటమి ప్రభుత్వాన్ని ఉద్యోగులు ఎన్నుకున్నారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మురుగమ్మ, మస్తాన్, సతీష్, గురునాథం, జీఆర్ చంద్రా, సతీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద ఎండలో భక్తుల అవస్థలు



తిరుపతి రూరల్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): వకుళామాత అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆలయ పరిసరాల్లో నీడలేక ఇబ్బందిపడుతున్నారు. మెట్ల దారి నుంచి అమ్మవారి గుడిపైకి వెళ్లే మార్గంలో కింద నుంచి రేకులషీట్లని ఏర్పాటు చేశారు. కూలింగ్‌పెయింట్ వేశారు. కిందకి దిగిన భక్తులు ౹కాసేపు సేదదీరేందుకు నీడలేదు. ఉదయం 11 నుంచే ఎండ తీవ్రమవుతోంది. దీంతో భక్తులు నిముషాల వ్యవధిలోనే తిరుగు ప్రయాణమవుతున్నారు. రోడ్డు మీద. చలువపందిరిళ్లు వంటివి ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ పరిసరాల్లో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు.

సరైన పత్రాలు లేని 21 బైక్‌ల సీజ్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు పుత్తూరు సీఐ సురేంద్రనాయుడు పేర్కొన్నారు. పుత్తూరు డివిజన్ డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువజామున బీడీ కాలనీ, ఆర్టీసీ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడంతో పాటు రూ.10,300 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు





సమ్యమేంద్రతీర్థ స్వామిజీ - ఐశ్వర్య రజనీకాంత్

తిరుమల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని ఆదివారం కాశీ మఠాధిపతి సమ్యమేంద్రతీర్థ స్వామిజీ, ప్రముఖ హీరో రజనికాంత్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్, ఆమె కుమారుడు లింగ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డుప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం రూ.3.85 కోట్ల మేర ఆదాయం వచ్చింది. శనివారం 78,873 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 30,065 మంది తలనీలాలు సమర్పించారు.

గాయపడి చికిత్స పొందుతూ మృతి



పార్థసారథి ఫైల్‌ఫోటో

చంద్రగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా.. పనపాకం పంచాయతీ బోడిగుట్టవారిపల్లెకు చెందిన పార్థసారథి(30) రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఈనెల 11వ తేది రాత్రి ద్విచక్ర వాహనం పంక్చర్ అవ్వడంతో పార్థసారథి జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డుకు వస్తుండగా ఆటో ఢీ కొంది. దీంతో తలకు తీవ్ర గాయమైంది. రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఇతడికి భార్య స్వాతి, కుమారుడు సాత్విక్, కుమార్తె తేజలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ రహదారి పక్కనే కోళ్ల వ్యర్థాలతో అవస్థలు



తిరుపతి రూరల్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): సి.మల్లవరం పంచాయతీ పరిధిలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి పక్కనే పలుచోట్ల కోళ్ల వ్యర్థాలు పడేస్తున్నారు. వీటి నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు, తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. బర్డ్‌ఫ్లూ వ్యాధి నేపథ్యంలో కోళ్ల వ్యర్థాలను పడేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హరియాణా గవర్నర్‌కు ఘనస్వాగతం



రేణిగుంట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఘనస్వాగతం లభించింది. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి నెల్లూరు పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టీడీపీ నాయకులు పులుగోరు మురళి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు.

యోగాలో అవార్డులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా బెంగళూరులోని శివ జ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో గత నెల 24, 25, 25 తేదీల్లో వర్చువల్‌లో యోగాసన పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన శివసాయి యోగా సెంటర్ మాస్టర్ సుజాత యోగా వృక్ష అవార్డును, విద్యార్థులు సాన్విత సూర్యకుమార్, ప్రియదర్శిని ప్రతిభ అవార్డులను సాధించారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

● నేడు వేడుకలకు అంకురార్పణ



౨ కల్యాణ వెంకన్న ఆలయ పుష్కరిణి వద్ద ప్రత్యేక శోభ

చంద్రగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోవాలు ఈనెల 18 నుంచి 26 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. తిరుమల తరహాలో నిర్వహించడానికి టీటీడీ సన్నద్ధమైంది. ఆలయంలో చలువ పందిళ్ళు, రంగువళ్ళిలు, ప్రత్యేకంగా ప్రసాద కౌంటర్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఆలయ వెనుక యాగశాల, కైంకర్యాలకు వేదికను ఏర్పాటు చేశారు. వాహన సేవలను తిలకించడానికి గ్యాలరీలు, పుష్ప ప్రదర్శనశాల, వాహనాల పార్కింగ్, సెల్‌పోన్ కౌంటర్, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఆలయ ప్రత్యేకాధికారి, చీఫ్ పీఆర్వో డాక్టర్ రవి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ హరికథలు, సంగీత కచేరీలు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో ఆర్జిత సేవలను రద్దు చేశారు.



సుందరంగా భక్తుల ప్రవేశ మార్గం

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం అంకురార్పణం చేయనున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవము, నిర్వహించి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.



కల్యాణ వెంకన్న ఆలయానికి ముస్తాబు

చెన్నారెడ్డి కాలనీలో అంబులెన్స్ డ్రైవర్ హత్య



జగదీష్ మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) తిరుపతి చెన్నారెడ్డికాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఓ అంబులెన్స్ డ్రైవర్ హత్యకు గురయ్యాడు. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన ప్రకారం.. చెన్నారెడ్డి కాలనీలోని సురేష్ అంబులెన్స్‌కు జగదీష్(45) కొంత కాలంగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ అంబులెన్స్‌కు సంబంధించి స్థానిక వినాయకస్వామి ఆలయం వద్ద చిన్న కార్యాలయం ఉంది. తంబళ్లపల్లెకు చెందిన సునీల్ మేస్త్రీ పని చేసుకుంటూ వినాయక స్వామి ఆలయ సమీపాన నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి భార్యతో సునీల్ గొడవపడుతూ.. ఒక దశలో హత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. దీనిని గమనించిన జగదీష్ ఘర్షణ పడుతున్న భార్యాభర్తలను వారించే ప్రయత్నం చేశాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సునీల్.. తన వద్దనున్న స్క్రూడ్రైవర్‌తో జగదీష్ గుండెపై గట్టిగా పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లారు. నిందితుడు సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. జగదీష్ మృతదేహాన్ని రుయాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్లు నిరంతర విద్యార్థులు కావాలి

సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు కావాలని సైకాలజిస్టు డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం రేణిగుంటలో జేసీఐ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో మురికి వాడల్లో పని చేసే ఎన్ఐఆర్ఎస్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఎప్పటికప్పుడు జ్ఞాన నవీకరణ చేసుకోవాలని చెప్పారు. జ్ఞానం, వికాసం, సహానుభూతి, భావ వ్యక్తీకరణ, ఓర్పు, సహనం, చైతన్యం, చురుకుదనం పెంచుకోవాలన్నారు. బోధన, పరిశోధన, కౌన్సెలింగ్ మార్గదర్శనంలో మెలకువలు పాటించాలన్నారు.

చెల్లిని చూసేందుకు వెళుతూ.. తిరిగిరాని లోకాలకు..!

● కంటైనర్‌ను మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడి మృతి
● మరొకరికి తీవ్ర గాయాలు
● మృతుడు తిరుపతి, క్షతగాత్రుడు ప్రకాశం జిల్లాల వాసులు
● ప్రాణం తీసిన అతివేగం



మృతిచెందిన రాజేష్‌నాయుడు

మనుబోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఫోన్ చేసినా స్పందించని చెల్లెలను చూసేందుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన అన్న రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు, బంధువుల కథనం మేరకు... తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన మద్దిపట్ల రాజేష్‌నాయుడు(34) ఆరేళ్ల క్రితం గూడూరుకు చెందిన ఎస్‌కే.ఆరిఫాను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 5 ఏళ్ల కుమార్తె, 3 ఏళ్ల కుమారుడు ఉన్నారు. కొయ్య పని చేసుకుని జీవనం సాగించే రాజేష్‌నాయుడు పనుల కోసం 5 ఏళ్ల క్రితం బండారుపల్లి నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండకు వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బండారుపల్లిలో ఉంటున్న తోడబుట్టిన చెల్లెలకు ఎప్పుడు ఫోన్ చేసినా మాట్లాడకపోవడంతో ఆమె వద్దకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో చెల్లిని చూసేందుకు ఆదివారం ఉదయం 9 గంటలకు సింగరాయకొండకు చెందిన తన స్నేహితుడు మునిశేఖర్‌తో కలసి మోటార్‌సైకిల్‌పై బండారుపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మనుబోలు మండలం కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై కోల్‌కత్తా నుంచి బెంగళూరుకు వెళుతున్న పార్శిల్ లారీ యాక్సిల్ విరిగిపోవడంతో డ్రైవర్ లారీని హఠాత్తుగా రోడ్డుపైనే నిలిపివేశాడు. దాని వెనుకాలే మోటారుసైకిల్‌పై వేగంగా వస్తున్న రాజేష్‌నాయుడు ముందు షడన్‌గా ఆగిన లారీని గుర్తించినా మోటార్‌సైకిల్ వేగాన్ని అదుపుచేయలేక వెనుకభాగంలో ఢీకొట్టాడు. దీంతో అదుపుతప్పి మోటారుసైకిల్‌తో పాటు రోడ్డుపై పడిన అతని తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతని వెనుక కూర్చుని ఉన్న మునిశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ.శివరాకేష్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అదేవిధంగా రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై వందలకొద్ది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. హైవే పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఆ వృద్ధురాలి నగదు, నగలు ఏమైనట్లు?

● గుర్తు తెలియని రోగులే లక్ష్యంగా రుయాలో కొందరి చేతివాటం ● వాటాల మధ్య సఖ్యత లేక వెలుగులోకి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, రోడ్డు పక్కన పడున్న వారిని ఆస్పత్రికి తీసుకొస్తే వైద్యుల సమక్షంలో వారి వద్దనున్న నగదు, విలువైన వస్తువులను నర్సులు సేకరించి బాధితుల బంధువులకు లేదా పోలీసులకు అప్పగిస్తారు. మరి, గుర్తు తెలియని వ్యక్తులను ఎవరైనా తీసుకొస్తే.. వీరి తరపున బంధువులు ఎవరూ రాకుంటే బాధితుల వద్దనున్న నగదు, విలువైన వస్తువులను కొందరు సిబ్బంది మాయం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా రుయాస్పత్రిలో చేరిన శకుంతల(70) నగదు, నగలు విషయంలో కొందరు చేతివాటం చూపారనే ఆరోపణలున్నాయి. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు.. తమకు తెలిసిన వారితో కలిసి శకుంతల(70) మూడు రోజుల కిందట తిరుమలకు వచ్చారు. కళ్లు తిరిగి పడిపోవడంతో 108 సిబ్బంది ఆమెను రుయాస్పత్రికి తీసుకొచ్చారు. అత్యవసర విభాగంలో వైద్యం అందించి.. ఫిమేల్ మెడిసిన్ వార్డుకు మార్చారు. ఇలా వార్డుకు మార్చినప్పుడు రెండు బంగారు ఉంగరాలు, ఒక జత కమ్మలు, మెడలో ఒక చైను, రూ.15 వేల నగదును సిబ్బంది ఒకరు తీసి.. వృద్ధురాలి బంధువులు వస్తే అప్పగిస్తామంటూ భద్రపరిచేందుకని తీసి ఉంచారు. అదే రోజు ఆమె కోలుకున్నా.. తన వివరాలను చెప్పడంలో తడబడింది. మొదట విశాఖపట్నం అని, తర్వాత శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస అని చెప్పడం.. తన కుమారుడు తిరుమలకు తీసుకొచ్చిన క్రమంలో తప్పిపోయానని, అతడే వెతుక్కుంటూ వచ్చి తనను తీసుకెళతాడని వార్డులోని సిబ్బందికి ఆమె చెప్పారు. ఆమె వద్ద నగలు, నగదు తీసుకున్న సిబ్బందిలో ఒకరు.. వృద్ధురాలి కోసం ఎవరూ రారని గ్రహించి మరో ఇద్దరితో కలిసి వీటిని పక్కదారి పట్టించేందుకు యత్నిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఆ క్రమంలో శకుంతలను అనధికారికంగా బయటకు పంపేందుకు శనివారం ప్రయత్నించగా, అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది ఆమెను మళ్లీ వార్డుకు తీసుకొచ్చారు. విశాఖపట్నంలో తనకు తెలిసిన వాళ్లున్నారని, వృద్ధురాలిని అక్కడకు పంపిస్తే వారు ఆమెను జాగ్రత్తగా ఇంటికి చేరుస్తారని వార్డులోని సిబ్బందికి చెప్పి సోమవారం శకుంతలను బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. కాగా, మరో ఇద్దరికీ కొంత విషయం తెలిసి.. వాటాల విషయంలో తేడాలు రావడంతో నగలు, నగదు విషయం బయటకు వచ్చింది. ఈ అంశం ఆదివారం అధికారుల వరకు చేరింది. వృద్ధురాలిని బయటకు వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకోండని, సోమవారం విచారించి తగు చర్యలు చేపడతామని వారు సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం.

సురుటుపల్లెలో శివరాత్రి బ్రహ్మోత్సవ సందడి









ఆలయంలో రంగవల్లులను తీర్చిదిద్దుతున్న మహిళలు - యాగశాల మండపానికి రంగులు వేస్తున్న పెయింటర్ - విద్యుద్దీప కటౌట్లు- ఆలయంలో విద్యుద్దీపాలంకరణ

నాగలాపురం, ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె పల్లికొండేశ్వరాయంలో ఈనెల 18నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి లత ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేశారు. 18న గ్రామదేవత పొన్నియమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేపట్టనున్నారు. రాత్రి మూషిక వాహనం, 19న పల్లకి వాహనం, 20న చంద్రప్రభ వాహనం, 21న కామధేను వాహనం, 22న భూత వాహనం, 23న అధికార నంది వాహనం, 24న గజ వాహనం, 25న అశ్వవాహనం, 26న శివరాత్రిని పురస్కరించుకుని వృషభ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించున్నారు. 27న కల్ప వృక్ష వాహన సేవ, 28న ఉదయం త్రిశూల స్నానం, రాత్రి రావణ బ్రహ్మ వాహన సేవలను నిర్వహించనున్నారు.

ముస్తాబైన పల్లికొండేశ్వరాలయం

ఆలయమంతటా రంగులు వేశారు. అలాగే ఆలయంలోపల, వెలుపల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. పట్టణంలో స్వామిఅమ్మవార్ల భారీ విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రంగులతో రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. ఉత్సవాల్లో క్యూలైన్ల వద్ద తోపులాటలు లేకుండా చర్యలు తీసుకునేందుకు నాగలాపురం ఎస్ఐ సునీల్ ఆలయ ఈవో, సిబ్బందితో సమీక్షించారు.

వేతనాలు, పెన్షన్ల కోసం నిధులివ్వండి

మంత్రి లోకేశ్‌కు ఎస్వీయూ అధికారుల విన్నపం



మంత్రి లోకేశ్‌కు విన్నవిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలోని ఉద్యోగులు, పెన్షనర్లకు జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన వేతనాలు, పెన్షన్ల కోసం రూ.37కోట్లు మంజూరు చేయాలని మంత్రి నారా లోకేశ్‌కు ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు విన్నవించారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన లోకేశ్ సంబంధిత అధికారులతో చర్చించి, సత్వరం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు తిరుపతిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కపిలతీర్థం రోడ్డులోని ఆనందరావు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. కళాకారులు కస్పా పద్మనాభన్, బండి మధుసూదనరెడ్డి, వెంకటయ్యను సత్కరించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషా, సాహిత్య రంగానికి శ్రీకృష్ణదేవరాయలు గొప్ప కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కేఎన్ రాజా, కొత్తపల్లి మునిరత్నం, సిద్ధేంద్రశర్మ, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్, శిల్పి వీరాచారి, చెన్నూరు సుబ్రమణ్యం, భాస్కర్, హేమాద్రి, కొత్తపల్లె శంకరయ్య, జయరామయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి



మంత్రిని కలసి వినతిపత్రాలు ఇస్తున్న విద్యార్థులు, పారా మెడికల్ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ విజిలెన్సు, వెటర్నరీ, పారా మెడికల్ విభాగాల్లో కారుణ్య నియామకాలకు చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాల సుబ్రమణ్యం నేతృత్వంలో మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. రేణిగుంట విమానాశ్రయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలను ఆయనకు విన్నవించారు. సీఎంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే నాని, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు బుల్లెట్ రమణ, కంకణాల రజనీకాంత్ నాయుడు, మధు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన వెటర్నరీ విద్యార్థులు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వెటర్నరీ విద్యార్థులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని కోరుతూ ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన దీక్షలో భాగంగా ఆదివారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యంతో కలిసి తమ సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి అచ్చెన్నాయుడితో చర్చించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు.

టీఎల్‌సీ తిరుపతి చాప్టర్ ప్రారంభం



సమావేశంలో టీఎల్‌సీ మాస్టర్‌మైండ్స్ చాప్టర్ ప్రతినిధులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): టీఎల్‌సీ మాస్టర్‌మైండ్స్ తిరుపతి చాప్టర్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రపంచ కార్యకలాపాల వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీసుందరం, కార్యనిర్వాహణాధికారి గుణశేఖర్ ప్రకటించారు. ఆదివారం ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలో టీఎల్‌సీ(టీచర్స్ లీడర్స్ కమ్యూనిటీ) మాస్టర్‌మైండ్స్ తిరుపతి చాప్టర్ ఉపాధ్యక్షులుగా ఎస్.సుబ్రహ్మణ్యంరాజును నియమించారు. వ్యాసరచనలో శిక్షణ తరగతులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తిరుపతి నుంచి కనీసం వెయ్యి మంది రచయితలుగా మారడానికి, వారి జ్ఞానాన్ని ప్రపంచంతో పంచుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఆసక్తిగలవారు 7993003936ను సంప్రదించాలని ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు కోరారు.

హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుగుణ

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేటీ రోడ్డులోని త్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం హస్తకళ, చేనేత వస్త్రాల ప్రదర్శనను ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల చేనేత కార్మికులు, డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులు, వస్త్రాలతో కూడిన స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను నిర్వాహకులు, నగరానికి చెందిన సుగుణ చేతులమీదుగా ప్రారంభించారు. వచ్చేనెల 2వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'త్రివేణి సంగమం'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం త్రివేణి సంగమం కార్యక్రమం తిరుపతిలో నిర్వహించనున్నారు. అమెరికాలోని శాక్రమెంటో నగరంలో గల కళాధర సంస్థకు చెందిన మధురా విశ్వనాథన్ బృందం భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం 6.05 గంటలకు అన్నమాచార్య కళా మందిరంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు తెలిపారు.

16మంది పేకాటరాయుళ్ల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అలిపిరి, తిరుపతి రూరల్ పరిధిలోని పేకాట స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు చేసి 16మందిని అరెస్టు చేశారు. అలిపిరి పరిధిలోని సత్యనారాయణపురంలో ఎస్ఐ లోకేష్‌బాబు ఆధ్వర్యంలో తనిఖీలు చేసి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18,445 స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పరిధిలోని తిరుమల నగర్‌లో ఎస్ఐ రామకృష్ణ దాడులు చేసి, ఎనిమిది మందిని అరెస్టు చేసి, రూ.11,200 స్వాధీనం చేసుకున్నారు.

సంకటహర చతుర్దశి వేడుకలు



తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయక సాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్దశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త చెంగారెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



లక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ మహిళా యూనివర్సిటీ లా పరిశోధకురాలు పి. లక్ష్మి డాక్టరేట్ పొందారు. నేచర్ అండ్ స్కోప్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్ పేటెంటింగ్ ఇన్ ఇండియా విత్ స్పెషల్ రెఫరెన్స్ టు ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్-యాన్-అనాలసిస్ అంశంపై ఆమె సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారని వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

శాస్త్రోక్తంగా ధన్వంతరి మహాలక్ష్మీ హోమం



ధన్వంతరి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): టీటీడీ సౌజన్యంతో పరిహోర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మైదానంలో ఆదివారం ధన్వంతరి, మహాలక్ష్మీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఫౌండేషన్ పదో వార్షికోత్సవం సందర్భంగా మైదానంలోని వేదికపై ధన్వంతరి, మహాలక్ష్మీ విగ్రహాలను ప్రతిష్ఠించి అర్చకస్వాములు హోమ క్రతువు నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ఐశ్వర్యం కలగాలని ఈ హోమం నిర్వహించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో తిరుచానూరు వారాహిపీఠం నిర్వాహకులు రుద్రస్వామి, ఎంపీ గురుమూర్తి, టీడీపీ నేత ముబ్బు దేవనారాయణరెడ్డి, అమాస రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ మునిశేఖర్‌యాదవ్, కె.ఎల్.వర్మ పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులు సాధిద్దాం



మాట్లాడుతున్న డీజీ సునీల్‌కుమార్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఐక్యతతో హక్కులు సాధించుకుందామని ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఆదివారం జాతీయ మాల సంఘాల జేఏసీ జిల్లా శాఖ అధ్వర్యంలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భావజాలం-నేటి సమాజ సవాళ్లు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కలిసి ఉంటే కలదు సుఖం అన్న సూక్తిని నిరంతరం జ్ఞప్తి చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగ హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడితేనే రాజ్యాధికారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పరమశివన్, సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేధింపులు భరించలేక వచ్చేశా..!

● కన్నీటి పర్యంతమైన వృద్ధురాలు ● అక్కున చేర్చుకున్న పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : 'కొడుకు, కోడలు నిత్యం గొడవపడుతున్నారు.. కొట్లాటలు, ఘర్షణకు దిగుతున్నారు.. జీవితంపై విరక్తి కలిగింది.. ఎక్కడికైనా వెళ్లి చచ్చిపోవాలని బస్సు ఎక్కి వచ్చేశా' అంటూ ఒక వృద్ధురాలు కన్నీంటి పర్యంతమైంది. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో బోరున విలపిస్తున్న ఆమెను అక్కడ గస్తీలో ఉన్న మహిళా పోలీసులు అక్కున చేర్చుకున్నారు. ఆమె చెప్పిన వివరాల మేరకు.. తిరుపతి సుభాష్‌నగర్‌కు చెందిన రాజేశ్వరమ్మ(72) బెంగళూరులోని కుమారుడు ఇంటి వద్ద ఉంటోంది. ప్రతిరోజూ కొడుకు, కోడలు ఆమె విషయమై గొడవలు పడుతున్నారు. హింసిస్తున్నారు. భరించలేక శనివారం బెంగళూరు నుంచి బస్సు ఎక్కి ఆదివారం ఉదయం తిరుపతికి వచ్చింది. బస్సు వద్ద బోరున విలపిస్తుండగా మహిళా రక్షక్ పోలీసులు గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా రక్షక్ ఎస్ఐ గిరిజ ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీసు వాహనంలో అలిపిరి పరిధిలోని శ్రీపద్మావతి వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. అనంతరం ఆమెను కుమార్తె సృజనకు అప్పగించారు. మహిళా రక్షక్ పోలీసులను ఎస్పీ హర్షవర్ధన రాజు అభినందించారు.

గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే కథలు

మీది తెనాలి-మాది తెనాలి పుస్తకావిష్కరణలో విజయలక్ష్మి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్య ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు రాసిన కథలు గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఉన్నాయని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విశ్రాంతాచార్యులు మూలె విజయలక్ష్మి అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు రాసిన 'మీది తెనాలి-మాది తెనాలి' పుస్తకావిష్కరణ సభలో ఆమె మాట్లాడారు. కథలు ఆద్యంతమూ చదివించే గుణాన్ని కలిగి ఉన్నాయన్నారు. వెటర్నరీ వర్సిటీ వీసీ వెంకటరమణ మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రచయితగా గొప్ప కథలు రాస్తున్నారని అభినందించారు. హాస్యానందం పత్రిక ఎడిటర్ రాము మాట్లాడుతూ ఈ కథల్లోని కామెడీ పాఠకులను ఆకట్టుకుంటుందన్నారు. బ్రౌన్ కేంద్రం పరిశోధకుడు శివారెడ్డి మాట్లాడుతూ కథల్లో మంచి సందేశం ఉందన్నారు. రచయిత కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ కథలు చదవడం వల్లే రాయడం నేర్చుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అధ్యక్ష, కార్యదర్శులు శేషసాయి దిలీప్‌కుమార్, రచయితలు రాచపూటి రమేస్, మౌని, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

భారత్ అద్భుత శక్తిగా ఎదుగుతోంది



ముగింపు సభ దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో భారత్ అద్భుత శక్తిగా ఎదుగుతోందని, యువత ప్రమేయంతో మరింత ఉన్నత స్థాయికి చేరడానికి అవకాశముందని ప్రొఫెసర్ కుప్పురం, ప్రొఫెసర్ మసిండే ములిరో, పద్మావతి వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డీఎం మమత పేర్కొన్నారు. వికసిత్ భారత్‌పై పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ - పూర్వ విద్యార్థి సంఘం సంయుక్తంగా మూడు రోజులుగా ఎస్వీయూలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు సభ శ్రీనివాసా ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. సదస్సు నిర్వాహకులుగా ప్రొఫెసర్ బీవీ మురళీధర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐఎన్ కిషోర్, అధ్యాపకులు శ్రీరాములు, వెంకటేశులురెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

మినిమం టైమ్ స్కేల్ కోసం ఉద్యమించాలి



సదస్సులో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపు కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు అన్నారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం యూనియన్ తిరుపతి జిల్లా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని ఆప్కాస్‌ను రద్దు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించాలని నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగులకు భద్రత ఉండదన్నారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగ భద్రత కోసం జేఏసీ అధ్వర్యంలో పోరాటాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు జీ నాగవెంకటేష్, జయచంద్ర, జి.చిన్నబాబు, గంగయ్య, రాజేంద్ర, నారాయణమ్మ, చంద్రమ్మ, నిర్మల పాల్గొన్నారు.

సుందర నగరమే లక్ష్యం

● కమిషనర్ మౌర్య

తిరుపతి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరంలోని స్కావెంజర్స్ కాలనీలో జరుగుతున్న పారిశుధ్య, సుందరీకరణ పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డుల తనిఖీల్లో భాగంగా స్కావెంజర్స్ కాలనీని ఇటీవల పరిశీలించి, అక్కడి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. అన్ని ఇళ్లకు అందమైన చిత్రాలను వేయిస్తున్నామని అన్నారు. డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే నగరంలోని పలు ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేస్తున్నామని, ప్రజల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని అన్నారు. కమిషనర్ వెంట డీఈ రాజు ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి(కలెక్టరేట్)/రేణిగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోమవారం తిరుపతి రానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. ఆదివారం రాత్రి విమానాశ్రయం నుంచి మంగళం వరకు సీఎం పర్యటించే ప్రాంతాలను ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్ పరిశీలించారు. విమానాశ్రయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, మంగళం రోడ్డు ఆశా కన్వెన్షన్‌లో జరిగే అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనం ఏర్పాట్లు పరిశీలించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఎస్పీలు శ్రీనివాసరావు, రవిమనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీనాయక్, రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభ, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేతలు



తిరుపతి, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి విమానాశ్రయానికి వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను స్థానిక టీడీపీ నేతలు కలిశారు. మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని, కూటమి నాయకులను కలుపుకుని తిరుపతిలో పార్టీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని లోకేశ్ చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నేతలు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, కంకణాల రజికాంత్ నాయుడు, సింగంశెట్టి సుబ్బరాయయ్య, బి.జి.కృష్ణా యాదవ్, కార్పొరేటర్ అన్నా అనిత, శంకర్ యాదవ్‌లు పాల్గొన్నారు.

టీటీడీ ధార్మిక కార్యక్రమాలు పెరిగేలా చర్యలు తీసుకోండి!



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చేపడుతున్న ధార్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేశ్‌ను టీటీడీ పాలకమండలి సభ్యుడు జి.భాను ప్రకాష్‌రెడ్డి కోరారు. ఆదివారం నెల్లూరులో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహ వేడుకల్లో ఆయన మంత్రి లోకేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీటీడీ ప్రస్తుతం అమలు చేస్తున్న ధార్మిక కార్యక్రమాల పరిధిని, సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరముందని మంత్రి దృష్టికి తెచ్చారు. అందులో భాగంగా శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున, అలాగే ప్రతి పౌర్ణమికీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచీన దేవాలయాల్లో ఏవైనా ధార్మిక కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత కార్యక్రమాలు చేపట్టేలా తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

సందడిగా బ్రాహ్మణ వివాహ పరిచయం



పేర్ల నమోదు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏపీ, తిరుపతి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం బైరాగిపట్టెడలోని శ్రీవైఖానస ఆశ్రమ కల్యాణ వేదికలో సందడిగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వధూవరుల వివాహ పరిచయ వేదికలో రిజిస్టర్ చేసుకున్న వారి వివరాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు, కార్యదర్శి వాసుదేవరావు, తిరుపతి బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు భీమాస్ బాలాజీ, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్, కోశాధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు



తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపికైంది. ఆదివారం యూత్ హాస్టల్లో జరిగిన సర్వసభ్య సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా డాక్టర్.పి.హరికృష్ణ, అధ్యక్షురాలిగా ఎల్.సుశీలమ్మ, కార్యదర్శిగా ఎ.రమణ, కోశాధికారిగా ఎం.దీపికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీటీడీ డీఈ జి.నారాయణప్ప తెలిపారు. హరికృష్ణ మాట్లాడుతూ 35 సంవత్సరాలు పైబడిన వారు అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకుని క్రీడలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు క్రీడాకారులు అభినందించారు.

సమస్యల పరిష్కారం కోసమే వార్డుబాట


సూళ్లూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార కోసమే వార్డుబాట కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆదివారం ఆమె టీడీపీ నాయకులతో కలిసి పట్టణంలోని 8వ వార్డులో వార్డుబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సూళ్లూరులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నుంచి వాటంబేడు రోడ్డు వరకు పర్యటించి ప్రజ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆమె స్పందిస్తూ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, కౌన్సిలర్ చెంగమ్మ, సురేష్‌నాయుడు, అలవల శ్రీనివాసులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు పోస్టుమార్టం

కుటుంబసభ్యులకు మృతదేహాల అప్పగింత

పెళ్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం దొడ్లవారి మిట్ట వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాదుకు చెందిన మాధవకృష్ణ(48), సరిత సుమంగళి(43) దంపతులు మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం మధ్యాహ్నం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. కుటుంబసభ్యులకు అప్పగించడంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో స్వస్థలానికి తీసుకువెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయకుల మౌఖిక ఆదేశాలు పాటిస్తే అధికారులకు ఇబ్బందులు తప్పవు: నేదురుమల్లి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నాయకుల మౌఖిక ఆదేశాలు పాటిస్తే అధికారులకు ఇబ్బందులు తప్పవని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 21న వైసీపీ నాయకుడు పేచిరాజ్‌ను అక్రమంగా అరెస్టు చేసిన వ్యవహారంలో కోర్టును ఆశ్రయించగా పోలీస్‌స్టేషన్ సీసీ పుటేజీలు, సంబంధిత అధికారుల కాల్ రికార్డులను అందించాలని కోర్టు కోరిందన్నారు. ఇటీవల నగర వనం ప్రారంభోత్సవంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి పేరు శిలాఫలకంలో రాయలేదని, ఈ విషయాన్ని ప్రివిలేజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, శాతరాశి బాలయ్య, వహిదా, సుజాత, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జట్టు

చిల్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నెల్లూరు జిల్లా జూనియర్ జట్టును ఎంపిక చేసినట్లు ఆ అసోసియేషన్ సెక్రటరీ, పీడీ శ్రీరేష్ తెలిపారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని చెప్పారు.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ


దివ్యాంగులకు కూరగాయాలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, ఆనంద్, కోటేశ్వరరావు, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ఇబ్రహీం, రజనీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల అందజేత


నిత్యావసరాలు అందజేస్తున్న సింహపురిరెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజేంద్రరెడ్డి, జైపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు షెడ్డులో అగ్ని ప్రమాదం

చిల్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కార్లు రిపేరింగ్ షెడ్డులో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. షెడ్డులో ఉన్న స్పేర్‌పార్ట్స్ కాలిపోవడంతో రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు శివకుమార్‌రెడ్డి తెలిపారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆడదామంటే అనువైన చోటేదీ?

- క్రీడా మైదానాల్లో వసతులు కరువు
- సాధన లేక పతకాలకు దూరమవుతున్న విద్యార్థులు


అధ్వానంగా ఉన్న చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

చిల్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ఎంతో అవసరం. మానసిక ఒత్తిడిని అధిగమించి చదువుల్లో రాణించి, క్రీడల్లో విజయం సాధించాలంటే సాధన ఎంతో ముఖ్యం. ఇందుకు తగిన వసతులు, సౌకర్యాలు ఉంటేనే విద్యార్థులు వారికి ఆసక్తి వున్న క్రీడల్లో సాధన చేసి పోటీల్లో రాణిస్తారు. చిల్లకూరు మండలంలో వివిధ క్రీడల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ముఖ్యంగా నెలబల్లిరెట్టపల్లి, పారిచెర్లవారిపాళెం, చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ చూపుతున్నారు.

జాతీయస్థాయి పోటీల్లో పతకాలు

నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి జంప్ రోప్ పోటీల్లో అండర్-14 విభాగంలో బాలికలు ఐదుగురు, బాలురు ఇద్దరు, అండర్ -17 విభాగంలో ఇద్దరు బాలురు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించి అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా నేపాల్ జరిగిన అంతర్జాతీయ అండర్-17 బాలుర విభాగంలో ఓ విద్యార్థి పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. రాష్ట్రస్థాయి జంప్‌రోప్‌కు అండర్-14 విభాగంలో ఐదుగురు బాలికలు, ఆరుగురు బాలురు, అండర్-17 విభాగంలో ఇద్దరు బాలురు పాల్గొన్నారు. జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఇద్దరు బాలికలు పాల్గొన్నారు. పారిచెర్లవారిపాళెం ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో ఇద్దరు చొప్పున బాల, బాలికలు ఎంపికయ్యాయి. జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలకు నలుగురు బాలికలు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి జావెలిన్‌త్రో, షాట్‌పుట్ పోటీలకు అండర్-14 విభాగంలో ఇద్దరు బాలికలు, అండర్-17 విభాగం నుంచి ఒక విద్యార్థిని ఎంపికయ్యారు. చిల్లకూరు ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్ -14 విభాగంలో బాల, బాలికలు ఒక్కొక్కరు, అండర్ -17 విభాగంలో ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. అలాగే బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు అండర్-14 విభాగంలో ముగ్గురు బాలికలు, ఇద్దరు బాలురు ఎంపికయ్యారు. వాలీబాల్ పోటీలకు అండర్-14, అండర్-17 నుంచి బాల, బాలికలు ఒక్కొక్కరు ఎంపికయ్యారు. త్రోబాల్ పోటీలకు అండర్-14 నుంచి ఒక విద్యార్థిని, అండర్-17 నుంచి ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు.

అభివృద్ధికి నోచుకోని క్రీడా మైదానాలు

మండలంలోని పలు పాఠశాలల క్రీడా మైదానాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో సాధన లేక ప్రతిభ కలిగిన విద్యార్థులు ఎంతో మంది విజయాలకు దూరమవుతున్నారు. ఎంతో అనుభవం కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. అరకొర వసతులతో అందుబాటులో ఉన్న క్రీడా మైదానాల్లోనే సాధన చేస్తూ విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ కనబస్తున్నారు. చిల్లకూరు, నెలబల్లిరెట్టపల్లి, పారిచెర్లవారిపాళెం, కడివేడు, వరగలి తదితర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చిల్లకూరు ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పదేళ్ల క్రితం అరకొరగా అభివృద్ధి పరిచారు. 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ఆయా క్రీడల్లో సాధన చేయడానికి అవస్థలు పడుతున్నారు. నెలబల్లిరెట్టపల్లి ఉన్నత పాఠశాలలో 100 మీటర్స్, 200 మీటర్స్ రన్నింగ్ ట్రాక్‌లు, వాలీబాల్, బాస్కెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు లేవు. పారిచెర్లవారిపాళెంలోని క్రీడామైదానంలో అరకొర వసతులు ఉండగా, కడివేడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అసలు క్రీడా మైదానమే లేదు. ఆయా పాఠశాలల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నా సరైన సాధన లేకపోవడంతో క్రీడల్లో రాణించలేకపోతువున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడా మైదానాల అభివృద్ధి చేయడంతో పాటు క్రీడాకారులు నైపుణ్యం మెరుగుపరుచుకుని విజయాలకు చేరువయ్యేలా కృషి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


చిల్లకూరు ఉన్నత పాఠశాలలో గడ్డితో మూసుకుపోయిన 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్

మంచి అలవాట్లతో గుండె జబ్బులు దూరం


గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగరాజు

గూడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంచి అలవాట్లు పాటిస్తూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చునని కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు సహకారంతో గుండె జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న కారణంగా గుండె జబ్బుల బారిన పడుతున్నారన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకునేందుకు ప్రతిరోజూ వాకింగ్ చేయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గుండెనొప్పి వచ్చినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్‌కుమార్, డాక్టర్ రమణయ్య, డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ ప్రకాష్, నిమ్మకాయల రవి, శర్మ, సురేష్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, రమణయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్(సైమాట్) అధికారి మస్తానయ్య అన్నారు. నాయుడుపేట మండలం పుదూరులోని బాలికల గురుకులంలో ఆదివారం నాయుడుపేట, గూడూరు డివిజన్లలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయా పాఠశాలలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ఫర్నిచర్, డిజిటల్ ల్యాబ్‌లు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో శివశంకర్, అసిస్టెంట్ ఏఎంవో మధు, డిప్యూటీ డీఎంవో సన్నత్, ఎంఈవో మునిరత్నం, ప్రిన్సిపాల్ రూత్‌రమోలా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మస్తానయ్య

నిండలిలో బెల్టుషాపు తొలగించాలి


నిండలి సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండలి గ్రామంలో ఏర్పాటు చేసిన బెల్టుషాపును తొలగించాలని స్థానికులు ఆదివారం సచివాలయం వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో బెల్టుషాపు నిర్వహించడం వల్ల సాయంత్రం పూట స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెల్టుషాపును తొలగించాలని సంబంధించిన అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రాజు, వెంకటయ్య, మహిళలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని నాగరాజుపురానికి చెందిన చంద్రయ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.43,727 చెక్కును ఎమ్మెల్యే విజయశ్రీ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు రమేష్, కిషోర్, సుధాకర్‌రెడ్డి, వెంకటస్వామి, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని పండితులు చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చెల్లిని చూసేందుకు వెళుతూ.. తిరిగిరాని లోకాలకు..!

కంటైనర్‌ను మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడి మృతి

మనుబోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఫోన్ చేసినా స్పందించని చెల్లెలిని చూసేందుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన సోదరుడు.. రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన మద్దిపట్ల రాజేష్‌నాయుడు(34) ఆరేళ్ల క్రితం గూడూరుకు చెందిన ఎస్‌కే.ఆరిఫాను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఐదేళ్ల కుమార్తె, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. కొయ్య పని చేసుకునే ఇతడు 5 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లా సింగరాయకొండకు నివాసం మార్చాడు. బండారుపల్లిలోని చెల్లెలికి ఎప్పుడు ఫోన్ చేసినా మాట్లాడకపోవడంతో ఆమెను చూసేందుకు ఆదివారం ఉదయం స్నేహితుడు మునిశేఖర్‌తో కలసి బైకుపై బయలుదేరాడు. మార్గమధ్యంలో కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపానకు వీరు రాగా.. ముందు వెళుతున్న పార్సిల్ లారీ యాక్సిల్ విరిగిపోవడంతో హఠాత్తుగా రోడ్డుపైనే డ్రైవరు నిలిపివేశాడు. దాని వెనుకాలే వస్తున్న వీరు బైకును అదుపుచేయలేక లారీని ఢీకొట్టారు. మోటారుసైకిల్‌తో పాటు రోడ్డుపై పడిన రాజేష్‌నాయుడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెనుక కూర్చుని ఉన్న మునిశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ శివరాకేష్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు. అదేవిధంగా రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై వందలకొద్దీ వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. హైవే పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం, సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల - నాయుడుపేటలో ప్రజలతో కరచాలనం

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం

నాయుడుపేట/టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఘన స్వాగతం పలికారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహానికి హాజరయ్యేందుకు రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో వెంకటాచలం వెళ్తున్న మంత్రికి నాయుడుపేట - విన్నమాల రింగ్ రోడ్డు వద్ద ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కొంతసేపు ఆగిన లోకేశ్‌కు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, నెలవల రాజేష్, పార్థసారథి, మధురెడ్డి, విజయకుమార్ నాయుడు, నాగేంద్రరెడ్డి, సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, సెల్వం, పళణి, ఆకుతోట రమేష్, చంద్రారెడ్డి, జనసేన నాయకులు ప్రవీణ్‌కుమార్, సుబ్బారావు, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహానికి హాజరయ్యేందుకు విచ్చేసిన లోకేశ్‌కు ఎమ్మెల్యే పాశిం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

డక్కిలి: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రేణిగుంట విమానాశ్రంలో మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, డక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట


ధ్వజస్తంభ ప్రతిష్ట పూజ చేస్తున్న చిదానంద స్వామి

నాయుడుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పాతబ్రాహ్మణ వీధిలోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించారు. వెంకటగిరి రాజాల కాలంలో నిర్మించిన కాశీవిశ్వేశ్వరాలయంలోని ధ్వజస్తంభం ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతింది. స్థానిక భక్తులు విరాళాలతో నూతనంగా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. నాగశక్తి పీఠానికి చెందినచిదానందస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కరీంబాయి హరి దంపతులు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో రవికృష్ణ, యుగంధర్, పాజర్ల లోకనాథం, అంజయ్య, సుబ్రహ్మణ్యం, సునీల్ తదితరులు ఉన్నారు. ఉభయకర్తగా రాజేష్ మధ్యాహ్నం అన్నదానం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


కార్డన్‌సర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు చేపడుతామని డీఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. ఆదివారం స్థానిక గాంధీనగర్ ప్రాంతంలోని దండోరా కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాలను అదుపు చేసేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నా, నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామసుందరపురంలో కార్డన్ సెర్చ్

కోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని శ్యామసుందరపురం, కోట బజారుసెంటర్‌లో ఆదివారం వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా తిరుగుతున్న 8 మోటారు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో కోట, చిట్టమూరు ఎస్ఐలు పవన్‌కుమార్, చినబలరామయ్య, ఏఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరిలో...

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో గృహాల వద్ద సీఐ రమణ ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని 25 మోటర్ సైకిళ్లు, 3 ఆటోలు, ఒక కారును సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, భవాని, గోపి, శవశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాసేలా కేంద్ర బడ్జెట్

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఈనెల 1వ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు కొమ్ముకాసేలా ఉందేకానీ పేదలకు ఉపయోగపడేలా లేదని వామపక్ష నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మన రాష్ట్రానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేం దుకు ఈనెల 20వ తేదీన స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, వెంకట్రామిరెడ్డి, శివకుమార్, కాలేషా, రమణయ్య, సురేష్, ప్రసాద్, శంకరయ్య, మణి, చంద్రయ్య, శ్రీనివాసులు, శశికుమార్, రమేష్ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

డక్కిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లగుంట గ్రామం వద్ద ఆదివారం ఎస్ఐ శివశంకర్ వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గత ఏడాది కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో ద్విచక్ర వాహన చోదకులే ఎక్కువగా ఉన్నారని చెప్పారు.


హెల్మెట్‌పై వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్

సీఎం చంద్రబాబు పర్యటనపై జేసీ సమీక్ష


సమీక్షిస్తున్న జేసీ బన్సల్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రేణిగుంట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తిరుపతి జిల్లా పర్యటనపై జిల్లా జాయింట్ కలెక్టర్ శుభవం బన్సల్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వివిధ శాఖల అధికారులతో ఆదివారం సాయంత్రం విమానా శ్రయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతిలో ఈనెల 17న సోమవారం టెంపుల్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ, ఎస్పీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అందరూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, సేఫ్ రూం, అధునాతన లైఫ్ సపోర్టు అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ తదితరాల ఏర్పాట్లపై విధులు కేటాయించారు. పోలీసు శాఖ బందోబస్తు పక్కాగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం జేసీ, ఎస్పీ సీఎం సదస్సులో పాల్గొనే ఆశా కన్వెన్షన్ సెంటర్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కన్వెన్షన్ సెంటర్‌లో తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఎస్పీలు శ్రీనివాసరావు, రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీనాయక్, రుయా ఆస్పత్రి వైద్య సూపరింటెండెంట్ రవిప్రభు, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

సంపన్నులకే రాయితీలు

రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్షాలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి సంపన్నులకు రాయితీలు పెంచిందని వామపక్ష నాయకులు ఎద్దేవా చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా జనమాల గురవయ్య, అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ దేశంలో 200 మంది కోటీశ్వరులపై నాలుగు శాతం సంపద పన్ను ప్రవేశపెట్టాలని, కార్పోరేట్ పన్ను పెంచాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర హామీ కల్పించాలన్నారు. బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డీఐ ఉపసహరిం చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీలకు, మహిళల సంక్షేమానికి కేటాయింపులు పెంచాలన్నారు. గోపి, శివకుమార్, గంధం మణి, గురవయ్య, జనార్దన్, రామచంద్ర, చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు నిరంతర విద్యార్థులు కావాలి

సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి


సూచనలిస్తున్న సుధాకర్‌రెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు కావాలని సైకాలజిస్టు డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం రేణిగుంటలో జేసీఐ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో మురికివాడల్లో పని చేసే ఎన్‌ఐఆర్‌ఎస్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఎప్పటికప్పుడు జ్ఞాన నవీకరణ చేసుకోవాలని చెప్పారు. జ్ఞానం, వికాసం, సహానుభూతి, భావ వ్యక్తీకరణ, ఓర్పు, సహనం, చైతన్యం, చురుకుదనం పెంచుకోవాలన్నారు. బోధన, పరిశోధన, కౌన్సెలింగ్ మార్గదర్శనంలో మెలకువలు పాటించాలన్నారు. పిల్లలకు ప్రాథమిక సూత్రాలు నేర్పడం కీలకమన్నారు. చదువులో తలత్తే శారీరక, మానసిక అవరోధాలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ తిరుపతి శాఖ అధ్యక్షుడు శేష సాయి, ఉపాధ్యక్షుడు రత్నశేఖర్, ఎస్‌ఐఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎం.హేమశేఖర్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరియాణా గవర్నర్‌కు ఘనస్వాగతం



రేణిగుంట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఘనస్వాగతం లభించింది. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి నెల్లూరు పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టీడీపీ నాయకులు పులుగోరు మురళి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు.

పుత్తూరు వార్తలు

మరాఠీ రైల్వే గేటులో ఇరుక్కున్న లారీ

మూడు రైళ్లు ఆలస్యం



పుత్తూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరాఠీ రైల్వే గేటు హైట్ గేజ్‌లో భారీ లారీ ఇరుక్కు పోవడంతో సిగ్నళ్లు పనిచేయక ఆదివారం మధ్యాహ్నం మూడు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ప్రతి రైల్వే గేటు ప్రవేశానికి ముందు 15.3 అడుగుల ఎత్తుకు పరిమితం చేస్తూ రైల్వే శాఖ పెద్ద ఇనుప దిమ్మెను ఏర్పాటు చేస్తోంది. చెన్నై వెళ్లే ఈ భారీ వాహనం ఎత్తును గుర్తించకుండా లోనికి ప్రవేశించడంతో ఇరుక్కుపోయింది. దీంతో రైళ్ల రాకపోకలకు లింకు వున్న ఆటోమేటిక్ సిగ్నళ్లు పనిచేయ లేదు. చెన్నై కు వెళ్లే ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి బయలు దేరిన రెండు గూడ్సు రైళ్లు ఆగిపోయాయి. రైల్వే అధికారులు చొరవ తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో రైళ్లను పంపారు.

పుత్తూరులో కార్డన్ సెర్చ్

సరైన పత్రాలు లేని 21 బైక్‌ల సీజ్



పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు పుత్తూరు సీఐ సురేంద్రనాయుడు పేర్కొన్నారు. పుత్తూరు డివిజన్ డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువజామున టీడీ కాలనీ, ఆర్టీసీ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడంతో పాటు రూ.10,300 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

అవయవాల సమస్య ప్లాస్టిక్ సర్జరీతో పరిష్కారం


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొంతమందికి పుట్టుకతో వచ్చే అవయవాల సమస్యలను ప్లాస్టిక్ సర్జరీతో సరిచేయవచ్చని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ కె.మురళీకృష్ణ, దంతవైద్యురాలు దేవి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కేబీఆర్ పురంలో తిరుపతి ఐకాన్ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. దంత, బీపీ, షుగర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. తిరుమలకుప్పం, రామసముద్రం, కృష్ణసముద్రం వాసులు పాల్గొన్నారు. కాగా పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఈ శిబిరాన్ని ప్రారంభించారు.

భవన నిర్మాణ కార్మికుల సభలను జయప్రదం చేయండి

రేణిగుంట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల జిల్లా సభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గంగమ్మ గుడి ఆలయంలో సమావేశాలపై సమీక్షించారు. ఈనెల 23, 24 తేదీల్లో తిరుపతిలోని గంధమనేని శివయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

18నుంచి సురుటుపల్లెలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో రంగవల్లులను తీర్చిదిద్దుతున్న మహిళలు - యాగశాల మండపానికి రంగులు వేస్తున్న పెయింటర్ - విద్యుద్దీప కటౌట్లు


ఆలయం వెలుపల, లోపల విద్యుద్దీపాలంకరణ

నాగలాపురం, ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె పల్లికొండేశ్వరాయంలో ఈనెల 18నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి లత ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేశారు. 18న గ్రామదేవత పొన్నియమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేపట్టనున్నారు. రాత్రి మూషిక వాహనం, 19న పల్లకి వాహనం, 20న చంద్రప్రభ వాహనం, 21న కామదేను వాహనం, 22న భూత వాహనం, 23న అధికార నంది వాహనం, 24న గజ వాహనం, 25న అశ్వవాహనం, 26న శివరాత్రిని పురస్కరించుకుని వృషభ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించున్నారు. 27న కల్ప వృక్ష వాహన సేవ, 28న ఉదయం త్రిశూల స్నానం, రాత్రి రావణ బ్రహ్మ వాహన సేవలను నిర్వహించనున్నారు.

ముస్తాబైన పల్లికొండేశ్వరాలయం

ఆలయమంతటా రంగులు వేశారు. అలాగే ఆలయంలోపల, వెలుపల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. పట్టణంలో స్వామిఅమ్మవార్ల భారీ విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రంగులతో రంగవల్లులు తీర్చి దిద్దుతున్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, క్యూలైన్ల వద్ద తోపులాటలు లేకుండా చర్యలు తీసుకునేందుకు నాగలాపురం ఎస్ఐ సునీల్ ఆలయ ఈవో, సిబ్బందితో సమీక్షించారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో లత

సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో ఈనెల 18వ తేదీ నుంచి 28 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈవో లత కోరారు. ఆదివారం బ్రహ్మోత్సవాలపై తన చాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్లు, తాగునీటి వసతి వంటివి కల్పిస్తున్నామన్నారు. దాతల సాయం ద్వారా ఆలయ మంతటా విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణలు చేపట్టనున్నామని చెప్పారు. క్యూలైన్ల వద్ద తోపులాటలు జరగకుండా వలంటీర్లను, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆలయ ప్రతిష్ఠను దిగజారిస్తే చర్యలు

ఆలయ ప్రతిష్ఠను దిగజారిస్తే కఠిన చర్యలు తప్పవని ఈవో లత హెచ్చరించారు. ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఆలయ ఉద్యోగిని విమర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారన్నారు. ఇలాంటి వాటిపై ఉపేక్షించేది లేదని, దేవదాయ శాఖ చట్ట కింద కేసులు నమోదు చేస్తామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం


లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రుద్రకోటి సదాశివం

రేణిగుంట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం ఉదయం 10.54 గంటలకు విమానాశ్రయం చేరుకున్న లోకేశ్‌కు తిరుపతి, చంద్రగిరి, నగిరి, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, పూతలపట్టు, సర్వేపల్లి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తినాని, గాలి భానుప్రకాష్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, బొజ్జల సుధీర్, మురళీమోహన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయకుడు శ్రీధర్ వర్మ, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్‌కుమార్‌రెడ్డి, రేణిగుంట తహసీల్దారు సురేష్‌బాబుకు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నెల్లూరుకు రోడ్డు మార్గాన వెళ్లారు. అంతకు ముందుగా విమానాశ్రయంలో వెటర్నరీ యూనివర్శిటీ మొదటి సంవత్సరం చదువుతున్న జూనియర్ డాక్టర్లు స్టైఫండ్ పెంచాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. కాగా ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.

న్యాయం చేయండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపురి పంచాయతీ ముద్దుమూడివాసులు తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌ను కోరారు. గ్రామంలో 200 కుటుంబాలు నివాసం ఉన్నామని తెలిపారు. అందరివీ వ్యవసాయ కుటుంబాలని పశువులు, మేకలు, గొర్రెలు సుమారు వెయ్యి ఉన్నాయని తెలిపారు. వాటి మేతకు ఎలాంటి స్థలం లేదని తెలిపారు. 2023లో ప్రభుత్వం 10.66 ఎకరాల్లో ఐదు ఎకరాల స్థలాన్ని బెటాలియన్ వారికి పట్టాలు ఇచ్చారని చెప్పారు. తిరిగి ఆ స్థలాన్ని గ్రామానికి కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

యానాదులను ఆర్థికంగా ఆదుకోండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): యానాదులను ఆర్థికంగా ఆదుకోవాలని సీఎం చంద్రబాబును తిరుపతి పార్లమెంటు టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య కోరారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో శనివారం గిరిజన, బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్‌తో కలిసి సుబ్బయ్య పాల్గొన్నారు. అనంతరం సీఎంను కలిసి రాష్ట్రంలో గిరిజనుల్లో అత్యధిక జనాభా ఉన్న యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు.

శివరాత్రి ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీకి ఆహ్వానం



పిచ్చాటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు దంపతులకు ఆహ్వానం పలికారు. యేటా జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జయచంద్రనాయుడు కుటుంబం ఉభయదారుగా వ్యవహరించే పల్లకి సేవతోనే ప్రారంభం కావడం విశేషం. ఈ క్రమంలో ఆలయ అర్చకులు ఆదివారం గోవర్ధనగిరిలోని మాజీ ఎమ్మెల్సీ గృహానికి చేరుకుని ఆహ్వానించారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం


లోకేశ్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే సుధీర్ ఆహ్వానించారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఎమ్మెల్యేకు సూచించారు. ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాపు నాయకుడికి సత్కారం


బాలాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాపునాడు సత్యవేడు నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన బాలాను ఎమ్మెల్యే ఆదిమూలం సత్కరించారు. ఆదివారం ఉదయం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను బాలా మర్యాదపూర్వకంగా కలిశారు. కాపునాడు అభ్యున్నతికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళం గోవన్‌రెడ్డి, కాపునాడు రాష్ట్ర కార్యదర్శి చిన్నా, టీడీపీ నాయకులు పద్దురాజు, బుజ్జి నాయుడు, రవిరెడ్డి, డిల్లీబాబు, రజని తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం: జనసేన

సత్యవేడు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల గెలుపుకోసం కృషి చేసిన జనసైనికులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా సంయుక్త కార్యదర్శి తడ శ్రీనివాసులు కోరారు. ఆదివారం సత్యవేడులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పార్టీ నియోజకర్గస్థాయి సమావేశం జరిగింది. అనంతరం నియోజకవర్గం కాపునాడు అధ్యక్షుడిగా నియమితుడైన బాలమురళీకృష్ణను సత్కరించారు. ఈ ఠాగూర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చెంచు కృష్ణకు రూ.33,319, విజయ్‌కుమార్‌కు రూ.2లక్షలు, సాయికుమార్‌కు రూ.2,56,116, కుమార్‌నాయుడుకు రూ.58,471, నాగరాజుకు రూ.36,976, మురళికి రూ1,63,395, షేక్ అబ్దుల్ హఫీజ్‌కు రూ.55,250, రామచంద్రయ్యకు రూ.2,53,109 అందజేశారు. చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, మునిరాజానాయుడు, బుజ్జి, మిన్నల రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయులు జయంతి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ రాజగోపురం వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయులు విగ్రహం వద్ద ఆయన 554వ జయంతిని ఆదివారం బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు పసుపులేటి నవీన్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు దేశభాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాషకు గొప్ప పేరు తెచ్చిన మహనీయుడని కొనియాడారు. ప్రసాద్, ఉప్పు కృష్ణయ్య, పగడాల సుధాకర్, సుబ్బారావు, ప్రసాద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లిటిల్ మాస్టర్ అబాకస్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపారు. చెన్నైలో గత నెల 26న నిర్వహించిన పోటీల్లో 27మంది మొదటి స్థానంలో, నలుగురు రెండవ స్థానంలో, ఒకరు మూడో స్థానంలో నిలిచారు. వీరికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

యోగాలో అవార్డులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా బెంగళూరులోని శివ జ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో గత నెల 24, 25, 25 తేదీల్లో వర్చువల్‌లో యోగాసన పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన శివసాయి యోగా సెంటర్ మాస్టర్ సుజాత యోగా వృక్ష అవార్డును, విద్యార్థులు సాన్విత సూర్యకుమార్, ప్రియదర్శిని ప్రతిభ అవార్డులను సాధించారు.